జనపనార సంచుల తయారీ కేంద్రాన్ని సందర్శించిన విజిలెన్స్ పీసీసీఎఫ్

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని దిగువమెట్ట గ్రామం నందు అటవీశాఖ ఆధ్వర్యంలో జనపనార సంచుల తయారీ కేంద్రాన్ని ఆదివారం విజిలెన్స్ పీసీసీఎఫ్ డాక్టర్ కె.గోపీనాథ్ సందర్శించారు. తయారు చేసిన వివిధ రకముల జనపనార సంచులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా వారికి తగు సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీఎఫ్ఓలు వినిత్ కుమార్, వైవి నరసింహా రావు, పీ.శివశంకర్‌రెడ్డి, ఎఫ్ ఆర్వో జీవన్ కుమార్, డిఆర్వో డీ.వంశీకృష్ణ, ఎఫ్ భివో ఎస్ ఏ ఖాయూమ్, జూట్ ట్రైనర్ లక్ష్మీ,అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

రైల్వేస్టేషన్లలో మహిళల భద్రతకు పటిష్ఠ చర్యలు

- గిద్దలూరు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్

విశాలాంధ్ర-గిద్దలూరు : స్థానిక రైల్వే స్టేషన్‌లో నంద్యాల రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఆదేశాల మేరకు గిద్దలూరు ఆర్పిఎఫ్ ఏ.ఎస్.ఐ హనుమారెడ్డి ఆధ్వర్యంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ అండ్ మహిళల భద్రతపై ఆదివారం సాయంత్రం ప్రయాణీకుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల అక్రమ రవాణాకు సంబంధించి ప్రయాణీకులకు అవగాహన కల్పించారు. రైల్వేలో ప్రయాణం చేసేటప్పుడు ప్రయాణికులు అత్యవసర సహాయం కోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నెం.139 అండ్ 1098 నెంబర్‌కి ఫోన్ చేయాలని తెలియజేశారు. హెడ్ కానిస్టేబుల్ కే. వి.శ్రీనివాసరావు, కానిస్టేబుల్ శేషయ్య, నాయబ్ రసూల్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో ఐఐటీ అడ్వాన్స్ పరీక్షల్లో మెరిసిన ఆసిమ్ షరీఫ్

విశాలాంధ్ర-తర్లుపాడు : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఐఐటీ అడ్వాన్స్ పరీక్ష ఫలితాలలో మండల కేంద్రమైన తర్లపాడు గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు షేక్ యూసుఫ్ షరీఫ్, అమీరునిషా బేగం దంపతుల కుమారుడు షేక్ ఆసిమ్ షరీఫ్ జాతీయస్థాయిలో 235 వ ర్యాంకు సాధించాడు. దీంతో ఆ విద్యార్థి పాత్రికేయులతో ముచ్చటిస్తూ ఐఐటీలో బీటెక్ చదివి పరిశోధనా రంగంలో రాణించాలన్నదే తనధ్యేయమన్నాడు. కుమారునికి నాణ్యమైన విద్యనందించిన చైతన్య కాలేజీ యాజమాన్యానికి విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతా భినందనలు తెలిపారు.

త్రైత సిద్ధాంత హిందూ ధర్మ ప్రచారం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : త్రైత సిద్ధాంత ఆది కర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారి అనుగ్రహంతో దోర్నాల మండలంలోని తిమ్మాపురం, యడవల్లి గ్రామాల్లోని త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదికకి చెందిన దొనకొండ కమిటీ వారి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం అనుబంధ గ్రంథాల ప్రచారం చేయడం ఆదివారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆది కర్త - శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంధాలను ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరం తెలుసుకొనుట వలన మధ్యాత్మ ఆరాధనతో ధర్మముల స్థాపన జరుగుతుంది. అదే త్రైత సిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. భగవద్గీత లోని పురుషోత్తమ ప్రాప్తి యోగ అధ్యాయంలో 16,17 శ్లోకాలు త్రైత సిద్ధాంతానికి ఆధారం అని, త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్యలో ఉన్న అసమానతలను తొలగించడానికి, సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజలలో దైవ భక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- దొనకొండ కమిటీ అధ్యక్షుడు సభ్యులు టి ఏడుకొండలు, ఎ చెన్నకేశవులు, ఎ.బాలరంయ్య, ఎ.వైష్ణవి, ఎ.సుబులు, బి.రాములు, టి.ఆది లక్ష్మి, టి బార్గవి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

దివ్యాంగులకు నోట్‌బుక్స్ పంపిణీ

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో ఒంగోలు రావి ఆంజనేయులు వీధి గుడ్ న్యూస్ మినిస్ట్రీ అంధుల పాఠశాలనందు పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ విద్యార్థులకు అందజేయడం అయినది. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బా రావు మాట్లాడుతూ దోస్తీ ఫౌండేషన్ ద్వారా విజయకుమార్. మాధవి. లలితల ఆర్థిక సహకారంతో బ్లైండ్ స్కూల్ నందు విద్యార్థులకు పుస్తకాలతో పాటు మాంసాహారం తొ కూడిన భోజనంఏర్పాటు చేయడం మానవత్వం కూడిన పనిఅని అన్నారు. షేక్ మహబూబ్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం చాలా సంతోషంగా ఉన్నదని రాబోయే రోజుల్లో దోస్తీ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ శ్రీనివాసరావు. కుమార్. స్వర్ణ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ కనిగిరి ఇన్‌చార్జిగా డాక్టర్ తాతపూడి ప్రభుదాస్

విశాలాంధ్ర-పామూరు : బీఎస్పీ కనిగిరి నియోజకవర్గ ఇన్చార్జిగా డాక్టర్ తాతపూడి ప్రభుదాసు ఎన్నికయ్యారు. కనిగిరి ఆర్ అండ్ బి అతిథి గృహములో జరిగిన సమావేశంలో బీఎస్పీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొని బీఎస్పీ పార్టీ సంస్థాగత విషయాలపై ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ మదనపల్లిలో జరిగే రాయలసీమ బహుజన రాజ్యాధికార సభకు కనిగిరి నియోజకవర్గ కార్యకర్తలు నాయకులు విరివిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ కనిగిరి నియోజకవర్గాన్ని బలోపేతం చేయడానికి బీఎస్పీ కనిగిరి నియోజకవర్గ అసెంబ్లీ ఇన్చార్జిగా డాక్టర్ తాతపూడి ప్రభుదాసును నియమిస్తున్నట్లు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్ మెయిన్‌లో ప్రతిభ చాటిన ముండ్లమూరు విద్యార్థి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముండ్లమూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బేతపూడి చెంచారావు మనవడు ఎండ్లూరి హనుమ నిహార్ చౌదరి జేఈఈ ఆల్ ఇండియా అడ్వాన్స్ మెయిన్లో 389 ర్యాంకు సాధించి ప్రతిభ చాటాడు. ఈ విద్యార్థి తెలంగాణ ఎంసెట్లో 200 ర్యాంకు సాధించాడు. ఏపీ ఎంసెట్లో 319 ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి పదవ తరగతి, ఇంటర్మీడియట్ విజయవాడ చైతన్య గాయత్రి భవన్‌లో విద్యను అభ్యసించాడన్నారు.

'మ్యాట్రిమోనీ'లో మోసగాళ్లతో అప్రమత్తం

జిల్లా ఎస్పీ మల్లికగర్గ్

విశాలాంధ్ర-ఒంగోలు : మ్యాట్రమోనీ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మల్లికగర్గ్ పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు, కొంతమంది మాయగాళ్లు అమాయకులను మోసం చేసేందుకు రోజుకో కొత్తమార్గం వెదుకుతున్నారని, మ్యాట్రిమోని సైట్లలో ప్రొఫైల్ అప్లోడ్ చేసిన పెళ్లి కాని యువతీయువకులను టార్గెట్ చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని, మ్యాట్రిమోని సైట్‌లో ప్రొఫైల్ చూసి నచ్చారని అప్రోచ్ అవుతారని, కొంత మంది ఫేక్ ప్రొఫైల్ అప్లోడ్ చేసి తర్వాత బాగా మాటలు కలిపి ఖరీదైన గిఫ్ట్లు, ఆభరణాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ కొనుగోలు లేదా ఇంట్లో అవసరాలకు డబ్బులు అవసరమని పలు రకాలుగా నమ్మించి ఫోన్ పే/ గూగుల్ పే ద్వారా ట్రాన్సఫర్ చేయించుకొని మోసం చేస్తారని, కొంతమంది ఒకరికి తెలియకుండా మరొకరిని పెళ్లి చేసుకోవడం,పెళ్లాయ్యాక వారి నుంచి నగదు, నగలు వసూలు చేసి పరారవ్వడం జరుగుతుందని, పెళ్లికాని యువతీయువకుల తల్లిదండ్రులే లక్ష్యంగా విదేశీ సంబంధం, ఆర్ధికంగా స్థిరపడినవారు, మంచి ఉద్యోగం, లైఫ్ సెటిల్ అవుతుందనే భావనను ఆసరాగా చేసుకుని మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ల ద్వారా మోసం చేస్తారని కావున ఇలాంటి మాట్రిమోనియాల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు. మ్యాట్రిమోని సైట్లు, సోషల్ మీడియా, ఇతర యాప్ లో మ్యారేజ్ సంబంధిత ప్రొఫైల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.మ్యాట్రిమోనీ సైట్లలో తెలిపే ప్రొఫైల్ లో వారి వివరాలు వాస్తవమో కాదో ఒకటికి రెండు సార్లు విచారించి, నిర్ధారించుకోవాలి.

మ్యాట్రిమోనీ సైట్ల ద్వారా తెలిసే విదేశీ సంబంధాలు, ఆర్థికంగా స్థిరపడినవారు, మంచి ఉద్యోగం అన్ని వివరాలు సరైనవి అని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే పెళ్లి చేసుకోవడానికి అంగీకారం తెలపాలి.మ్యాట్రిమోనీ సైట్లలో పరిచయమైన వారితో పెళ్లి కాకుండానే ఎటువంటి ఆర్థిక లావాదేవీలు జరపడం మంచిది కాదు. మ్యాట్రిమోనియల్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైన ఈ తరహా మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చేయండి లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : విద్యుత్ ఘాతానికి గురై గేదెలు మృతి చెందిన సంఘటన వీరన్నపాలెంలో జరిగింది. అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన నువ్వుల సాంబశివరావు తనకున్న ఐదు గేదెలు తోలుకొని ఆదివారం ఉదయం వీరన్నపాలెం వద్దకు వెళ్ళగా అక్కడ విద్యుత్ తీగలు తెగిపడి ఉండటంతో విద్యుత్ ఘాతానికి గురై ఐదు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి జరిగిన సంఘటనపై బాధితుడు సాంబశివరావు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు మృతి చెందిన గేదెలు విలువ సుమారు మూడున్నర లక్షలు ఉంటుందని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు.

యువత మేలుకో- సమస్యలను జయించి భవిష్యత్తు నిర్మించుకో

విశాలాంధ్ర-గిద్దలూరు : మన దేశానికి వెన్నుముక అయిన యువత వారి జీవితాలలో ఎన్నో ప్రణాళికలు మరియు లక్ష్యాలు కలిగి ఉన్నప్పటికీ వ్యసనాలకు లోనవ్వడం మరియు సమయపాలన పట్ల సరియైన అవగాహన కలిగిలేకపోవడంతో ఎన్నో ఇబ్బందులుకు లోనవుతున్నారు. ముఖ్యంగా మద్యం, మత్తుపదార్ధాలు, అశ్లీలం, మొబైల్ గేమింగ్ మొదలైన వ్యసనాలకు బానిసలవ్వడంతో మానసిక ఆరోగ్యాన్ని కోల్పో వడమే కాకుండా తమ లక్ష్యాలని చేరుకోలేని పరిస్థితి. దేశ పురోగాభివృద్ధి యువతతోనే సాధ్యం అలాంటి యువతే అనైతికత, మానసిక ఒత్తిడికి లోనైతే వారి వ్యక్తిగత జీవితంతో పాటుగా కుటుంబం, సమాజంపై కూడా దాని ప్రభావం పడుతుంది. ఈలాంటి ప్రభావాలు కలిగిన యువత తమ సమస్యలను గ్రహించి వాటి నుండి బయటపడే మార్గాలను గ్రహించి వాటిని అనుసరించి ఉత్తమమైన భవిష్యత్ నిర్మించుకోవాలి. కనుక యువత మేలుకో సమస్యలను జయించి భవిష్యత్ నిర్మించుకో అనే నినాదంతో యువకుల సమస్యల ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 16 నుండి 25 వరకు స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ శాఖ నిర్వహించిన ఈ ఉద్యమం ద్వారా వీలైనంత వరకు యువత సమస్యలు వాటి పరిష్కారాల దిశగా యువతలో అవగాహన కలిపించేలా కార్యక్రమాలు చేపట్టను న్నట్టు కన్వీనర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జమాత్-ఏ-ఇస్లామి హింద్ కార్యకర్త ఫాజిల్, గిద్దలూరు యూనిట్ ప్రెసిడెంట్ అబ్దుల్లా, యూనిట్ సెక్రెటరీ సుబాని సభ్యులు ఖాదర్ వలీ, ఫయాజ్ కార్యకర్తలు అమీర్, ఫారుక్ పాల్గొన్నారు.

కళా సాంస్కృతిక యోధుడు గాండ్ల వెంకట్రావుకి విప్లవ జోహార్లు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : కళ కళ కోసం కాదు, కల ప్రజల కోసం అని, పీడిత, తాడిత ప్రజల హక్కుల కోసం పనియటం, సైకిల్ మీద ఊరు వాడ తిరిగి ప్రజలకు వైద్యం చేసిన గొప్ప వాడు కామ్రేడ్ గాండ్ల వెంకట్రావు అని వక్తలు కొనియాడారు. పౌర హక్కుల నేత కామ్రేడ్ గాండ్ల వెంకట్రావు 10వ వర్ధంతి సభ ఆదివారం నాడు ఒంగోలులోని ప్రెస్ క్లబ్‌లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభకు అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు చొప్పర జాలన్న అధ్యక్షత వహించగా పాల్గొన్న వివిధ కళా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ పేద ప్రజల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడిన వాడు కామ్రేడ్ గాండ్ల వెంకట్రావు అని కొనియాడారు. అనేక నిర్బంధాలు వచ్చి విప్లవకారులను అరెస్టు చేస్తున్న సమయంలో వారికి అండగా నిలబడిన వాడు అని అన్నారు. అన్ని రకాల కళా సంస్థలను ఏకం చేసి, గరికపాటి రాజారావు 50 వర్ధంతి సభలను విజయవంతంగా నడిపించిన వారని అన్నారు. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత పౌర హక్కుల ఉద్యమంలో ముఖ్యంగా పనిచేశారన్నారు. శ్రీశ్రీ, కన్నభిరాన్ బాలగోపాల్ లాంటి ప్రముఖులతో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నరని అన్నారు. పౌర హక్కుల సంఘం జిల్లా కార్య దర్శిగా, జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అనేక బాధ్య తలు నిర్వహించారు అన్నారు. ఈ క్రమంలో పోలీస్ ల నుంచి అనేక నిర్బంధాలు వచ్చినప్పటికీ ధైర్యంగా ఎదుర్కొని నిలబడ్డారన్నారు.. తన కుటుంబం ఆర్థికంగా మానసికంగా ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నప్పటికీ, పేద ప్రజల కోసం వారి హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసిన యోధుడు కామ్రేడ్ గాండ్ల వెంకటరావుని కొనియాడారు. అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య, ప్రజా కళా మండలి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పి. శీను, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పొత్తూరి సురేష్, కామ్రేడ్ గాండ్ల శ్రీనివాసరావు, కామ్రేడ్ చిట్టి పార్టీ వెంకటేశ్వర్లు, కామ్రేడ్ బి పద్మ, కామ్రేడ్ సి ఎస్ సాగర్, కామ్రేడ్ నాతాని హనుమంతరావు, మహాలక్ష్మి, ఉబ్బా కోటేశ్వరరావు, తదితర కళాకారులు పాటలు పాడారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

విశాలాంధ్ర-దర్శి : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా, ప్రజల సుఖ సంతోషాలే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందని దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ, సమస్యలుపై ఆరా తీస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ప్రజలనడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందడంలేదని దృష్టికి తీసుకొచ్చినవారి ఎదుటే అధికారుల ద్వారా పరిష్కార మార్గాన్ని చూపిస్తున్నారు. వీధులలో నెలకొన్న సనస్యల పరిష్కారంపై ఆయన ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. సమస్యల పరిష్కారానికే గడప గడప కు మన ప్రభుత్వం కార్య క్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు.ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందన్నారు. ఎన్నికలలోనూ, మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశంలోనే ఆదర్శంగా సీఎం జగన్ నిలుస్తారన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత, తదితర పథకాలు సుమారుగా అన్ని ఇళ్లకు అందడంతో గడప గడపనా ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు లబ్ది అందడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేసి, సీఎం జగన్‌కి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వై వి సుబ్బయ్య, మండల అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, ఎంపీపీ, కౌన్సిలర్ ఆవుల జ్యోతి, మేడగం మోహన్‌రెడ్డి, బాబురావు, మోహన్ బాబు, సాని కొమ్ము తిరుపతిరెడ్డి, కేసరి రాంభూపాల్‌రెడ్డి, బండి గోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, గోపు ఎర్రయ్య, వేమిరెడ్డి చెన్నారెడ్డి, కుమ్మిత అంజిరెడ్డి, గురవయ్య, కేసరి శ్రీనివాస్ రెడ్డి, గంజి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐఐటి జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థిని భవ్య శృతి

విశాలాంధ్ర-మార్కాపురం : అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐఐటి జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో పట్టణంలోని విద్యాసంస్థల విద్యార్థిని భవ్య శృతి జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలలో 1018 ర్యాంకు సాధించింది. భవ్య శృతిని కమల విద్యాసంస్థల చైర్మన్ పెనుగొండ కేశవరావు, వైస్ చైర్మన్ పెనుగొండ పవన్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డి సుధాకర్‌లు అభినందించారు. మార్కా పురం డివిజన్ నుండి జాతీయ స్థాయిలో జరిగిన ఐఐటి జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాలలో భవ్య శృతి ర్యాంకు సాధించడం పట్ల పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్ బాలు నాయక్ హర్షం వ్యక్తం చేశారు.

ఆ పంచాయతీకి అతనే బాస్

- ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలన్నీ అతని బంధువులకే
- పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు అన్యాయం
- ఎమ్మెల్యే గారు కాస్త దృష్టి సారించండి

విశాలాంధ్ర-పీసీపల్లి :

ఆ పంచాయతీకి అతనే బాస్ నేనే మంత్రి నేనే రాజును అంటూ ప్రభుత్వ అధికారులపై పెత్తనం సాగిస్తూ చలామణి అవుతున్నాడు. పెద ఇర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుకింగ్ ఏజెన్సీ అతని అన్న కొడుక్కి, స్కూల్ చైర్మన్ అతని బామ్మర్దికి, ప్రభుత్వ బిల్డింగులు కట్టింది అతనే, అంగన్వాడీ కార్యకర్త అతని బంధువే, హై స్కూల్ వాచ్మెన్ ఇతని అన్న కొడుకే, ప్రభుత్వం సబ్సిడీలో ఇచ్చిన జగనన్న యంత్ర పథకం ఇతను బంధువులకు ఇలా చెప్పుకుంటూ పోతే ఆ పంచాయతీని తానే శాసిస్తున్నట్లు ఇట్టే అర్థం అయిపోతుంది. నేను చెప్పిన వారికే పనులు చేయండి మరి ఎవరికి పనులు చేయొద్దు అని అధికారులకు హెచ్చరికలు జారీ చేశాడు. ఇంకేముంది అసలే ఓ ప్రజా ప్రతినిధి భర్త మన కెందుకులే తలనొప్పులు అని అధికారులు సైతం మిన్ను కుండిపోవడం విశేషం. తద్వారా ఆది నుండి పార్టీని నమ్ముకుని జెండా మోసిన వాళ్ళకి అన్యాయం జరుగుతుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని పెదయిర్లపాడు ఆశా వర్కర్ ఉద్యోగానికి ఆలూరి గౌతమి దరఖాస్తు చేసుకుంది. జాయినింగ్ లెటర్ రావడంతో ఉద్యోగంలోకి జాయిన్ అయింది. నాలుగు రోజులు ఉద్యోగ వృత్తి కూడా కొనసాగించింది. అయితే ఏమైందో ఏమో తెలియదు గానీ ఆ పంచాయతీని శాసిస్తున్న బాస్‌కు ఆలూరు గౌతమి ఉద్యోగం చేయటం నచ్చడం లేదు. నువ్వు ఇక్కడ ఉద్యోగం చేయడానికి వీలు లేదు నేను వేరే మనిషిని ఉద్యోగంలో పెట్టుకుంటాను అని అంటున్నాడని గౌతమి ఆవేదన వ్యక్తం చేసింది. ఇది ఎక్కడి న్యాయం మండలంలో వైఎస్సార్సీపీ కార్యకర్తలు అందరికీ ఆవేదన వ్యక్తం చేస్తూ ఏ ఒక్కరైనా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి తాను ఉద్యోగంలో కొనసాగిచ్చేటట్లు సహకరించాలని మండల వైఎస్సార్సీపీ నాయకులను వేడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎమ్మెల్యే గారు కాస్త దృష్టి సారించండి

మండలంలో మొదటి నుంచి పార్టీ కోసం పార్టీ ప్రతిష్ట కోసం కష్టపడి పనిచేసిన నాయకులను తుంగలో తొక్కి అవమానిస్తున్నారని కొందరు నాయకులు ఆరోపణలు చేస్తున్నారు. ఇది ఇలాగనే కొనసాగితే పార్టీకి భవిష్యత్తులో నష్టం వాటిల్లక తప్పదని ఇప్పటికైనా శాసనసభ్యులు స్పందించి మండలంలో జరుగుతున్న పరిణామాలను కాస్త గమనించాలని వైఎస్ఆర్సిపి కాంగ్రెస్ పార్టీ అభిమానులు కార్యకర్తలు వేడుకుంటున్నారు.

'ఉగ్ర'ను సన్మానించిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కనిగిరి మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని ఆదివారం హైదరాబాదులో అమీర్‌పేటలో సీఎస్‌పురం, పామూరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనర సింహారెడ్డి హైదరాబాదులో ఉన్న సీఎస్‌పురం, పామూరు, కనిగిరి ప్రాంత వాసులతో కలుసుకోవడానికి ఆదివారం అమీర్‌పేట వెళ్లారు. అమీర్‌పేటలో ఈ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు కలుసుకొని సమావేశం ఏర్పాటు చేశారు. ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో తాను కనిగిరి టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని తెలంగాణాలో స్థిరపడినటువంటి వారు తన గెలుపుకు కృషి చేయాలని కోరారు. నారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పాములపాటి మాధవ ప్రసాద్, అమీర్‌పేట పీజీ హాస్టల్స్ ప్రెసిడెంట్ కె రాజశేఖర్, కావేరి ట్రావెల్స్ అధినేత పెంచలయ్య, టీడీపీ నాయకులు సీహెచ్ వీరాంజనేయులు, కొప్పుల సురేష్, శ్రీను, పెద్ద సుబ్బయ్య, చిన్న సుబ్బయ్య, సీహెచ్ వేణుగోపాల్, బాబురావు, వెంకటేశ్వర్లు, కోటిరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

అవినీతికి కేరాఫ్ 'పీసీపల్లి తహసీల్దార్ కార్యాలయం'

- తండ్రి స్థానంలో కొడుకు వీఆర్ఓగా విధులు నిర్వహిస్తూ దందా
- తహసీల్దార్‌పై చర్యలేవి?
- నకిలీ వీఆర్వోకి డబ్బులు ఇచ్చిన బాధితులు ఒక్కొక్కరు వెలుగులోకి వస్తున్న వైనం
- అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం
- పై అధికారులు విచారణ జరపాలని బాధితుల వినతి

విశాలాంధ్ర-పీసీపల్లి :

మండలంలోని అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా పెద చెర్లోపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందంజలో ఉంది. పామూరు తహసీల్దారుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై పీసీపల్లి మండలానికి తహసిల్దార్‌గా వచ్చారు. అయితే వచ్చిన మొదటిలో తండ్రి స్థానంలో కొడుకు వీఆర్ఓగా విధులు నిర్వర్తించడం ఏమిటి అని అతనిని తహసీల్దార్ కార్యా లయంలోకి నెల రోజులు అనుమతించ లేదు. అనంతరం కార్యాలయంలో తహసీల్దార్ కింది స్థాయి ఉద్యోగి తహసిల్దార్‌తో చర్చలు జరిపి తహసిల్దార్‌కు ప్యాకేజీ ఇచ్చేటట్లు మాట్లాడుకుని తండ్రి స్థానంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ చలామణి అవుతున్నారు. అయితే ముద్దపాడు పెద్ద ఇర్లపాడు గుదేవారి పాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో రైతులకు తక్కువ ధరకే పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తానని భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడి గత వారం పది రోజుల నుండి రైతులు సంబంధిత నకిలీ వీఆర్వోకు ఫోన్ చేసిన ఫోన్ ఎత్తటం లేదని కార్యాలయానికి వెళ్లి అడిగినప్పుడు డొంకతిరుగుడు సమాధానాలు చెబుతూ తప్పించుకుంటున్నాడని రైతులు ఆరోపించారు. శనివారం తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి నేరుగా తహసీల్దార్ కే ఫిర్యాదు చేయగా రైతులపై తహసీల్దార్ చిందులు వేసిన సంగతి తెలిసిందే.

ఒక్కొక్కటిగా వెలుగులోకి :

ఇది ఇలా ఉండగా శనివారం విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురితమైన తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి జలగలు కథనానికి బాధితులు ఒక్కొక్కరుగా 'విశాలాంధ్ర' విలేఖరికి ఫోన్ చేసి తమ బాధను వెళ్ళబోసుకున్నారు. ముద్దపాడు రెవెన్యూ పరిధిలోని బొట్టుపల్లి పెద ఇర్లపాడు చౌట గోగులపల్లి గుదేవారిపాలెం గ్రామ చుట్టుపక్కల సుమారు 300 ఎకరాలకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పిస్తానని దందాకు పాల్పడినట్లు సమాచారం. విజయవాడకు చెందిన ఒక వ్యక్తి నుండి భూమిని ఆన్లైన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చేందుకు భారీ మొత్తంలో నగదు వసూళ్లు చేసినట్లు చెపుతున్నారు. అతను ఎన్నిసార్లు సదరు నకిలీ విఆర్‌ఓకి ఫోన్ చేసిన స్పందించడం లేదని బాధితుడు ఆ గ్రామానికి చెందిన వాళ్లను నకిలీ వీఆర్వో దగ్గరికి పంపించి అడిగించినట్లు సమాచారం. చౌట గోగులపల్లి ఓ రైతు వద్ద నుండి ఇలాగే డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

తహసీల్దార్ ప్రమేయం లేకుండానే ఇంత వ్యవహారం జరుగుతుందా? :

ఇదిలా ఉండగా మండల తాసిల్దార్ ప్రమేయం లేకుండా ఈ వ్యవహారం అంతా జరుగుతుందా అని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. సమస్యను విన్నవించుకోవడానికి వెళ్లిన రైతుల పైనే చిందులు తొక్కి నకిలీ వీఆర్వోని కాపాడుతున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గతంలో పలు పత్రికల్లో తండ్రి స్థానంలో కొడుకు ఉద్యోగం అని కథనాలు వచ్చినప్పటికీ తహసీల్దార్లు మారుతున్నారే తప్ప అతనిపై చర్యలు తీసుకున్న వారు ఏ ఒక్కరూ లేరనటంలో సందేహం లేదు. ఇదంతా చూస్తుంటే తహసిల్దార్లే ప్యాకేజీల కోసం అతన్ని కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

కలెక్టర్ గారు మీరైనా స్పందించండి

తండ్రి స్థానంలో కొడుకు విఆర్‌ఓగా ఎలా విధులు నిర్వహిస్తారు పై అధికారుల నుండి ఆదేశాలు ఏమైనా వచ్చాయా నకిలీ వీఆర్వో గా చలామణి అవుతూ రైతుల దగ్గర డబ్బులు వసూలు చేయమని చెప్పింది ఎవరు ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు దొరకని పరిస్థితి. కలెక్టర్ గారు మీరైనా స్పందించి తమకు న్యాయం జరిగే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో కొమరోలు వాసి మృతి

విశాలాంధ్ర-కొమరోలు : బేస్తవారిపేట మండలం పూసలపాడు గ్రామ సమీపంలోని అమరావతి అనంతపురం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం ఆదివారం చోటుచేసుకుంది. బొలెరో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడు కొమరోలు మండలం రెడ్డిచర్ల గ్రామానికి చెందిన కాశి నాగేశ్వరరావుగా (27) పోలీసులు గుర్తించారు. జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నమని బేస్తవారిపేట ఎస్సై మాధవరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కంభం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్నామని అన్నారు.

మల్లికార్జున స్వామి మొదటి వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రమైన ముండ్లమూరులో గల శ్రీ మల్లమాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి మొదటి వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. దేవాలయంలో మహాన్యాస పూర్వక, రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులైన దుర్భాకుల నగేష్ శర్మ, మిన్నీ కంటి శ్రీరామ మూర్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు పొంగళ్ళు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి ముండ్లమూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన వేంపాడు, పెదరావిపాడు, తమ్మలూరు, నాయుడుపాలెం, పోలవరం, శంకరాపురం, ఉల్లగల్లు, పసుపుగల్లు, చింతలపూడి, ఉమా మహేశ్వరపురం, తదితర గ్రామాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులేకుండా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్లను వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని స్వామికి హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమం నా ఊరే నా ఇల్లు ముండ్లమూరు కమిటీ ఆధ్వర్యంలో జరిగింది.

గుంటి గంగ దేవాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-తాళ్లూరు : ప్రకాశం జిల్లాలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తాళ్లూరు మండలం తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడు రెవెన్యూ పరిధిలో ఉన్న గుంటి గంగ క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుండే ఆలయ పూజారిణి విజయలక్ష్మి గుంటి గంగ మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలతో, పూలమాలలతో, బంగారు, వెండి ఆభరణాలతో అందంగా అలంకరించారు. తదుపరి మండలంలోని వివిధ గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండి భక్తులు విరివిగా పాల్గొని నైవేద్యాలతో అమ్మవారి మొక్కులు తీర్చుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈవో ఏబి భాస్కర్‌రెడ్డి దేవాలయంలో ఉండి భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. 238 దర్శనం టికెట్లు, 10 వాహన పూజలు జరిగాయని, భక్తులు అమ్మవారికి 2,660 రూపాయల విరాళాలు అందించారని, ఆదివారం ఒక్క రోజు 5540 రూపాయల ఆదాయం లభించినట్లు దేవాదాయ శాఖ రికార్డ్ అసిస్టెంట్ కే శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గేదెను ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-మర్రిపూడి : రాత్రివేళ గేదెను ఢీకొడంతో వ్యక్తి మరణించిన సంఘటన శనివారం రాత్రి మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళితే కనిగిరి మండలం ఏరువారిపల్లె గ్రామానికి చెందిన రావూరి వెంకయ్య (30) తాళ్లూరు నుండి తిరిగి వస్తుండగా, మండలంలోని కూచిపూడి శివారు పెట్రోల్ బంక్ సమీపంలో చీకట్లో గేద కనిపించకపోవడంతో చీకట్లో ఢీకొని రోడ్డుపై పడి అక్కడే మరణించాడు. ఎస్సై అంకమ్మరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ ఆసుపత్రి తరలించి పోస్టుమార్టం బంధువులకు అప్పగించామని ఎస్సై తెలిపారు.

పేద విద్యార్థుల కోసమే జగనన్న ఆణిముత్యాలు

విశాలాంధ్ర-మర్రిపూడి : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న అనుముత్యాలు పథకం ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకేనని అందుకే దీన్ని ఏర్పాటు చేశామని మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకట్రెడ్డి అన్నారు. శనివారం ఆయన జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ నాడు నేడు పథకం కింద ప్రభుత్వం పాఠశాలలను రూప రేఖలు మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. గత ఏడాది పాఠశాలలో అత్యధిక మార్పులు సాధించి నా అలికేపల్లి వెంకట సుజాత, ద్వితీయ స్థానం సాధించిన భూ నా స్రవంతి తృతీయ స్థానం సాధించిన ఆర్ బ్రహ్మారెడ్డిలను, మెడల్ ప్రశంసా పత్రాలు నగదులతో పాటు సాల్వతోపాటు సత్కరించారు. సర్పంచ్ కె భాస్కర్, విద్యా కమిటీ చైర్మన్ డి శివరామయ్య ప్రధానో పాధ్యాయులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-మద్దిపాడు : 1960 నుండి 1980 వరకు చదువుకున్న ఏఐఎస్ఎఫ్ పూర్వ విద్యార్థుల సహకారంతో సర్వసేవ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం జరిగింది. గత కొన్ని సంవత్సరాల నుంచి సరోజ్ సేవ ఫౌండేషన్ ఆసరా కేంద్రం ద్వారా అనేకమంది వృద్ధులకు ఆశ్రయం కల్పించడమే కాకుండా, వివిధ వైద్య నిపుణులచే ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం, పేద విద్యార్థులకు సహాయం చేయడం, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు, తక్కువ ధరకే మినరల్ వాటర్ పంపిణీ తదితర కార్యక్రమాలను సరోజ్సేవ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు చెడిపోతే వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోనే పెద్దకొత్తపల్లి పంచాయతీ మారెళ్ళ గుంట పాలెం సమీపంలో ఏర్పాటు చేసిన సరోజ సేవా ఫౌండేషన్ ఆసరా కేంద్రంలో ఆవరణంలో పుత్తూరు సుబ్బమ్మ పేరయ్య కమ్యూనిటీ హాలు నందు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఒంగోల్ నగర మందుల షాపుల అసోసియేషన్ వారి సహకారంతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) ప్రారంభించారు. ఒంగోలు నగరానికి చెందిన పలు హాస్పటల్ వైద్య నిపుణులచే నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది..వైద్య శిబిరం నందుఎముకలు, కీళ్ళు ,వెన్నుముక, నరముల వైద్య నిపుణులు డాక్టర్ బోడపాటి రాజశేఖర్, షుగర్ థైరాయిడ్ ఇతర హార్మోన్ వ్యాధులకు సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎం హనుమంతరావు, ఫెలో ఫిష్ ఇన్ డయాబెటిస్ మేనేజ్మెంట్ డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు, కాస్ట్రోఎంటరాలజిస్ట్ ఎప్టాలజిస్ట్ తెరో ప్యూటిక్ ఇండోస్కోపిస్ట్ డాక్టర్ మానస మన్నే, సిమ్స్ చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ వి. చెంచయ్య, కాస్మోటిక్స్ చిగురు వ్యాధి నిపుణులు పోలవరపు హరీష్ ,చెవి ముక్కు గొంతు శస్త్ర నిపుణులు డాక్టర్ మద్దిశెట్టి శ్రీనివాసరావుల, సలహా మేరకు వైద్య శిబిరానికి హాజరైన అటువంటి 250 మంది రోగులకు వైద్య సిబ్బంది ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగింది. .వైద్య శిబిరము నందు డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. మెగా ఉచిత వైద్య శిబిరం నందు ఆయా హాస్పటల్ వైద్య నిపుణులు తమ హాస్పటల్ నందు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను వివరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో సరోజ్ సేవ ఫౌండేషన్ ఆసరా కేంద్ర పాలకమండలి సభ్యులు ఎంసి వెంకటేశ్వర్లు సింగయ్య నాతాని భూపతిరావు ఆయా హాస్పటల్ పిఆర్వోలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 'శ్రీ సరస్వతి' ప్రభంజనం

విశాలాంధ్ర-ఒంగోలు : జెఇఇ అడ్వాన్స్‌డ్-2023 ఫలితాలలో శ్రీ సరస్వతి విద్యాసంస్థల విద్యార్థులు మొదటి బ్యాచ్‌లో ప్రభంజనం సృష్టించారు. జాతీయ స్థాయిలో కంటే విష్ణు మాధవ్ 2741వ ర్యాంకును, మానం నరశింహ 3629వ ర్యాంకును సాధించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో శ్రీ సరస్వతి విద్యాసంస్థల అధినేత ఎవి రమణారెడ్డి విద్యార్థులను అభినందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో శ్రీ సరస్వతి విద్యాసంస్థలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు, డైరెక్టర్లుకు, అద్యాపకులకు అభినందనలు తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టర్లు ఆవుల గణేష్‌రెడ్డి, ఆవుల గంగా శంకరరెడ్డి ,సిఇఓ ఎన్‌వి సురేష్, డీన్స్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదవడం నాకిష్టం

విశాలాంధ్ర-టంగుటూరు : స్థానిక శాఖా గ్రంథాలయం ఆదివారం చదవడం నాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అదిక సంఖ్యలో పాల్గొని కథలు చదవడం, జనరల్ నాలెడ్జ్ బుక్స్‌తో పాటు మరెన్నో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను చదవడం జరిగిందని గ్రంథ పాలకులు గుమ్మడి వర్ధనరాజు తెలిపారు.

ఏఐటీయూసీ కౌన్సిల్ సమావేశానికి తరలిన నాయకులు

విశాలాంధ్ర-దర్శి : ఒంగోలు మల్లయ్య లింగమయ్య భవన్లో జరుగుతున్న ఎఐటియుసి జిల్లా కౌన్సిల సమావేశాలకు దర్శి నుంచి ఎఐటియుసి అనుబంధ కార్మిక వర్గ సభ్యులు ఆదివారం ఒంగోలుకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎఐటియుసి దరిశి నియోజకవర్గ కార్యదర్శి కోటంశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్ట వ్యతిరేక విధానాలను అవలంబించడం ఉద్యోగ కార్మికులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక చట్టాలని ఎదుర్కొనేందుకు ఉద్యోగ కార్మికులందరూ ఒక త్రాటి పైకి వచ్చి భవిష్యత్తులో ఉద్యమం దాల్చాలని తెలిపారు. కార్మికులకు రక్షణగా ఉండే చట్టాల్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకు రావాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఏఐటియుసి సీనియర్ నాయకులు జూపల్లి కోటేశ్వరావు ఎగ్గొని మల్లారెడ్డి ఏఐటియుసి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సమావేశంలో కల్లూరి చిన్న అంజనేయులు, ఆటో యూనియన్ సెక్రటరీ సుబ్బారెడ్డి శామంత పూడి ఆటో యూనియన్ ప్రెసిడెంట్ డి కోటేశ్వరావు, గండి కోటేశ్వరరావు, హమాలి యూనియన్ నాయకుడు మరికొందరు పాల్గొన్నారు. సీనియర్ నాయకులు పోతురు గోవింద్ తదితరులు పాల్గొన్నారు. టైల్స్ యూనియన్ ప్రెసిడెంట్ కాశిరెడ్డిలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధాకర్ బాబును కలిసిన విద్యుత్ ఏడీఈ

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మండల విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ అధికారిగా భాధ్యతలను చెప్పట్టిన డివి రామకృష్ణారెడ్డి సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చీమకుర్తి మండల పరిధిలోని విద్యుత్ సమస్యలకు చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యేకు వివరించినట్లు ఆయన తెలిపారు. మచిలీపట్నం నుండి చీమకుర్తికి బదిలీపై వచ్చినట్లు ఏడిఈ డివి కృష్ణారెడ్డి తెలిపారు.

ఇంటింటికి పైపులైన్ పనులను పరిశీలించిన చైర్మన్

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటికి కుళాయి మంచి నీరు ఇవ్వడమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య ఉదేశ్యమని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. ఆదివారం సమస్య పరిష్కారం లో భాగంగా 11 వ వార్డు దేవాంగనగర్ నందు ఇంటికి నీళ్ల సరఫరా చేయు పైపులైన్ల పనులను చైర్మన్ అబ్దుల్ గఫార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికి పైపు లైన్ల పనులు నాణ్యత లోపం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి వార్డు ప్రజలకి వెంటనే నీరు అందించి వారి యొక్క దాహర్తినీ తీర్చాల్సిన బాధ్యత మాపై ఉందని అన్నారు.అలాగే కనిగిరి పట్టణ అభివృద్ధి కార్యక్రమాలలో సహకరించే కనిగిరి శాసన సభ్యులకు బుర్ర మధు సుధన్ యాదవ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది సుమైర్, వైసీపీ నాయకులు మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

1966 బ్యాచ్ పూర్వ విద్యార్థుల కళాశాల సందర్శన

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరులోని సివిఆర్ కళ్యాణ్ మండపం ఆవరణంలో ఆదివారం నాడు పూర్వ విద్యార్థులు 1966 బ్యాచ్‌కు చెందిన కళాశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశంలో భాగంగా పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించడం జరిగినది. వీరిలో కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు ప్రముఖ గుండె వైద్య నిపుణులు, పద్మ డాక్టర్ దాసరి ప్రసాదరావు శ్రీమతి శారదా శ్రీమతి ప్రసన్న రిటైర్డ్ జేఎన్‌టీయూ ఆచార్యులు చిడిపోతు వెంకటేశ్వర్లు ఉన్నం వెంకటసుబ్బయ్య కారుమంచి సుబ్బారావు తదితరులు మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో బైపీసీ గ్రూపు నందు జిల్లా ప్రథమ స్థానం సాధించిన సంద్రపాటి స్పందనను అభినందిస్తూ ఆమె ఉన్నత చదువునకు అయ్యే ఖర్చును అందించుటకు హామీ ఇవ్వడం జరిగినది.

వైఎస్ఆర్ బీమా పేదలకు వరం

విశాలాంధ్ర-కనిగిరి : వైఎస్ఆర్ బీమా పేదలకు వరమని కౌన్సిలర్ రామనబోయిన ప్రశాంతి శ్రీనివాసులు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో ఇటీవల పానుగంటి కోటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందగా వైయస్సార్ భీమాను ఆదివారం నామినీకి అందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రామనబోయిన ప్రశాంతి శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ సారథ్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ రామాంజినియాలు, కన్వీనర్ షేక్ జానీ , నర్సింగ్, నరసింహ, ఈర్ల శీను, కంటు కేశవ,పుట్ట నాగబాబు, పుట్ట మని, కంటు అజయ్ పాల్గొన్నారు.

నవరత్నాలతో అన్ని వర్గాలకు మేలు

జడ్పీ చైర్ పర్సన్ వెంకాయమ్మ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా నవరత్నాలు పథకాలతో అన్ని వర్గాల వారికి మేలు జరిగిందని జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకయ్యమ్మ అన్నారు. మండల కేంద్రమైన కొనకనమిట్లలో శనివారం రాత్రి జరిగిన అంకాలమ్మ దేవత తిరునాళ్ల సందర్భంగా కొనకనమిట్ల వైసిపి నాయకులు పుట్లూరువారిపల్లి వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ 108 వంటి పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో నిలిచారని ఆయన తనయుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు వందకు వందశాతం అమలు చేశారని గుర్తు చేశారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి మరల సీఎం అవుతారని జోస్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాల చెప్పేవన్నీ బూటక వాగ్దానాలని ప్రజల వాటిని నమ్మరని వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావాలన్నా రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా నాగార్జునరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణ జడ్పీటిసి సభ్యులు ఏడుకొండలు వైసీపీ మండల కన్వీనర్ ఎం శంకర్‌రెడ్డి సచివాలయ కన్వీనర్ సూరవరపు పెద్ద వెంకటరెడ్డి నాయకులు కామసాని వెంకటేశ్వర రెడ్డి వై తిరుపతి రెడ్డి మాజీ సర్పంచ్ కొండారెడ్డి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రారంభమైన పోలేరమ్మ కొలుపులు

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరులో గ్రామదేవతగా పిలువబడుతున్న పోలేరమ్మ కొలుపులను ఈ నెల 17వ తేదీ నుండి వచ్చే నెల రెండో తేదీ వరకు కార్యక్రమాలు జరుగుతాయని కార్యనిర్వాహక కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.

జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో 20వ ర్యాంకు

విశాలాంధ్ర-తర్లుపాడు : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో తర్లుపాడు మండలం, కలుజువ్వలపాడు గ్రామం లోగల జవహర్ నవోదయ విద్యాలయం ప్రకాశం-2కుచెందిన విద్యార్థి మాస్టర్ దీరావత్ మాలిక్ ఎస్టీ క్యాటగిరిలో ఆల్ ఇండియా స్థాయిలో 20వ ర్యాంకు సాధించాడని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ప్రసన్న కుమార్ ఆ విద్యార్థిని అభినందించారు. అంతేకాక విద్యాలయం యొక్క కీర్తి ప్రతిష్టలు పెంచాడని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి యొక్క తల్లిదండ్రులు కూడా సంతోషం వ్యక్తం చేశారు.

కనిగిరి ఆర్డీవోకి సన్మానం

విశాలాంధ్ర-వెలిగండ్ల : కనిగిరి డివిజన్ ఆర్డిఓ అజయ్ కుమార్ తెలుగుదేశం నియోజకవర్గం క్లస్టర్ ఇంచార్జ్ దొడ్డ వెంకటసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ నంబూరు వెంకటేశ్వర్లు, వెలిగండ్ల టిడిపి నాయకులు కొండు భాస్కర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా శనివారం ఆర్డిఓ కార్యాలయంలో కలసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో భూ సమస్యలను సామరస్యంగా పరిష్కరిం చాలని ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు గురికారాదని ప్రజలను కార్యాలయం చుట్టూ తిట్టుకోకుండా కింద స్థాయి అధికారులకు సూచనలు ఇవ్వాలని వారు కోరారు.

ప్రణాళికా బద్ధంగా శ్రమిస్తే విజయం మీదే

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రణాళికా బద్ధంగా శ్రమిస్తే విజయం మీ చెంతకు చేరుతుందని శ్రీ ప్రతిభ విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అలా శ్రమించటం ద్వారానే జిల్లాకు చెందిన వినూత్న ఐఎఎస్‌సాధించగలిగారని ఆయన తెలిపారు. యువ ఐఎఎస్ బొల్లిపల్లి వినూత్న అభినందన కార్యక్రమం శ్రీ ప్రతిభ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. నల్లూరి మాట్లాడుతూ లక్ష్యాలను సాధించటానికి ఆత్మవిశ్వాసంతో పాటు అంకిత భావం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు వినూత్న సమాధానం ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం వినూత్నను ఘనంగా సత్కరించారు.ఈ కార్య క్రమంలో విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ నల్లూరి సీతారామాం జనే యులు, సిఇఓ నల్లూరి జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : నేడు మండలంలోని వై చర్లపల్లి గ్రామంలో గడపగడప కార్యక్రమం నిర్వహించ బడుతుందని దోర్నాల మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి తెలియ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మాత్యులు డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారు. కావున మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ అన్ని విభాగాల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్‌లు, గృహ సార థులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు అందరు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరడమైనది.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

తెలుగు యువత రాష్ట్ర నాయకులు రామిరెడ్డి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పాడాల్సిన రోజులు దగ్గరపడ్డాయని రాష్ట్ర తెలుగు యువత నాయకులు కామసాని రామిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కొనకనమిట్లలో శనివారం రాత్రి జరిగిన అంకాలమ్మ దేవత తిరునాళ్ల సందర్భంగా కొనకనమిట్ల టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ పై మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యపానం నిషేధం అని చెప్పి ఇచ్చిన హామీ తుంగలో తొక్కి కోటర్ బాటిల్ 200 రూపాయలు సొంత బ్రాండ్లను అమ్ముకుంటూ ప్రజల దోచుకుంటున్నారని నిత్యవసర సరుకులు విద్యుత్ పెట్రోల్ డీజిల్ గ్యాస్ చార్జీలు బస్ చార్జీలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులపై దాడులు ఎక్కువయ్యాయని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కాట్రగంటలో 600 ఎకరాలు మద్దిమడుగులో ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని విమర్శించారు. రాజధాని లేని రాష్ట్రంగా చేసి ఆంధ్రప్రదేశ్ అప్పులు ఊబిలోకి నెట్టారని గుర్తు చేశారు. పశ్చిమ ప్రాంత ప్రజలకు సాగు తాగునీరు రావాలంటే వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కావాలన్నా మార్కాపురం జిల్లా ఏర్పాటు కావాలన్నా అక్కడచంద్రబాబు ముఖ్యమంత్రి ఇక్కడ కందుల నారాయణరెడ్డి ఎమ్మెల్యే అయితేనే సాధ్యమవుతుందన అందుకు టిడిపి నాయకులు కార్యకర్తలు జనసేన నాయకులు కార్యకర్తలు సైనికుల పనిచేసి టిడిపిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చరు ఈ కార్యక్రమానికి మండల టిడిపి అధ్యక్షుడు బాబురావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ చప్పిడి రామలింగయ్య కుందూరు కాశిరెడ్డి, వేంపాటి శ్రీకాంత్‌రెడ్డి, ముక్కాల శ్రీనివాసులురెడ్డి, మువ్వా కాటమరాజు బురెడ్డివెంకటేశ్వర్‌రెడ్డి, భాషపతి నాయుడు రోశయ్య గురువయ్య, డేవిడ్ తాటిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలలో సీనియర్లకు అన్యాయం

ఎస్టీయూ జిల్లా అధ్యక్ష్యులు దాసరి శ్రీనివాసులు

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలలో సీనియర్లకు తీరనిఅన్యాయం జరిగిందని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు మరియు ప్రమోషన్లు 2023 ను ప్రభుత్వం అన్ని జిల్లాల్లో ప్రతిష్టాత్మకంగా ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించినప్పటికీ ప్రకాశం జిల్లాలో ఐటీ సెల్‌లో అనేక పొరపాట్లు వల్ల ప్రకాశం జిల్లాలో బదిలీల ప్రక్రియ సజావుగా నిర్వహించబడలేదన్నారు. ఐటీ సెల్ వల్ల గాని, ఉపాధ్యాయులు అర్హతకు మించి పాయింట్లు పొందడం వల్ల గాని అర్హులకు, సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని సర్వత్ర విమర్శలు వస్తున్నాయన్నారు. హడావుడి ప్రమోషన్ షెడ్యూల్ ప్రకటించడం వల్ల అర్హులైన సీనియర్లకు బదులు జూనియర్లు ప్రమోషన్కు నమోదు కాబడ్డారు. అప్పీల్ చేసుకొనుటకు కూడా తగిన సమయం కేటాయించలేదన్నారు. అలాగే ఎస్ టి కేటగిరి విషయంలో కూడా ప్రమోషన్ లో అవకతవకలు జరిగినాయని విమర్శలు ఉన్నాయి. అలాగే ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ లోపాల వల్ల దాదాపు 33 మంది ఉపాధ్యాయులు ఏ ప్లేస్‌ను కోరుకోకుండా గాలిలో ఉన్నట్లుగా భావిస్తున్నారు. ప్రకాశం జిల్లాలో జరిగిన ఈ ఉపాధ్యాయ బదిలీల, ప్రమోషన్ల లోపాలను సవరించ దానికి ప్రత్యేక విచారణ అధికారిగా ఆర్ జె డి సుబ్బారావుని నియమించడం జరిగిన విషయం తెలిసిందేనన్నారు. సదరు అధికారి నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి దోషులను శిక్షించి అర్హులకు, సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయవల సిందిగా డిమాండ్ చేశారు.

ప్రతిభ చూపిన 'శ్రీ ప్రతిభ' విద్యార్థులు



చేగొండి మదన్

విశాలాంధ్ర-ఒంగోలు : జెఇఇ అడ్వాన్స్‌డ్-2023 ఫలితాలలో శ్రీ ప్రతిభ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులతో తమ ప్రతిభ చాటుతున్నారు. చేగొండి మదన్ జాతీయ స్థాయిలో 3461వ ర్యాంకు సాధించి తమ సత్తా చాటారు. ఈసందర్భంగా శ్రీ ప్రతిభ విద్యాసంస్థల ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు విద్యార్థిని అభినందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో తమ విద్యార్థులకు వరుసగా నాల్గొసారి అత్యుత్తమ ర్యాంకులు సాధించటం ఆనందంగా ఉందన్నారు. 2022లో నాగండ్ల కృష్ణ చైతన్య జాతీయ స్థాయిలొ 1214వ ర్యాంకు 2021లో కంటు కుసుమిత జాతీయ స్థాయిలో 3345వ ర్యాంకు, 2019లో కొండమూరి మదన్ జాతీయ స్థాయిలో 599వ ర్యాంకు, మక్కెన సుదర్శన్ జాతీయ స్థాయిలో 2017వ ర్యాంకు, కొప్పోలు అఖిల్ జాతీయ స్థాయిలో 2551వ ర్యాంకు సాధించి తమ సత్తా చాటారన్నారు. ర్యాంకు సాధించిన విద్యార్థినిని విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సిఇఓ నల్లూరి జయప్రకాష్‌నారాయణ్, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.